



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు సమయ పాలన పాటించాలన్నారు. ప్రతీ దరఖాస్తును పూర్తిగా పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. కాగా, మొత్తం 126 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరి, ఆర్డీవో వాసుచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

ప్రజావాణిలో 96 ఫిర్యాదులు

» మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, జూలై 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసల కోర్చి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు తమ వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాగా, ప్రజావాణిలో మొత్తం 96 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు త్వరలో బ్రాడ్‌బ్యాండ్(ఇంటర్నెట్) సదుపాయం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కంప్యూటర్ ఆధారిత విద్యకు ఆదరణ పెరుగుతున్న క్రమంలో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. ఈ సంవత్సరం జిల్లాలో 581 స్కూళ్లకు ఈ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి జిల్లా విద్యాశాఖ ప్రతిపాదనలు పంపించింది. కాగా, గతేడాది జిల్లాలో 19 ప్రాథమిక పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పాఠాల బోధన ప్రారంభించిన విషయం తెలిసిందే.




బడికి బ్రాడ్‌బ్యాండ్!

విద్యార్థులకు అందుబాటులోకి ఇంటర్నెట్



- ఈ ఏడాది జిల్లాలో 581 స్కూళ్లలో ఏర్పాటుకు ప్రతిపాదనలు
- విడతల వారీగా అన్ని బడులకు సదుపాయం
- కొత్తపుంతలు తొక్కనున్న విద్యాబోధన



వికారాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలలకు బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం కల్పించడంతో ఈ విద్యా సంవత్సరం నుంచి బోధన కొత్త పుంతలు తొక్కనుంది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు సదుపాయం ఉన్న పాఠశాలలకు ఇప్పటి వరకు ఈ వెసులుబాటు లేకపోవడం వల్ల కొన్నిచోట్ల ఉపాధ్యాయులే తమ సొంత సెల్‌ఫోన్ డేటాను ఉపయోగిస్తున్నారు. అయితే ఐఎఫ్‌పీబీని పాఠ్యాంశాలు బోధించాలంటే ఇంటర్నెట్ వేగం సరిపోని పరిస్థితి. ఇదిలా ఉంటే, తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లు ఉపయోగించరాదని ప్రభుత్వం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ద్వారా బ్రాడ్ బ్యాండ్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై ఉపాధ్యాయుల్లో

మిగతా 8వ పేజీలో...

నేడు వికారాబాద్‌కు మంద కృష్ణమాదిగ



వికారాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌కు మంగళవారం పద్మశ్రీ మంద కృష్ణ మాదిగా రానున్నారని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాదిగ తెలిపారు. పెన్షన్ల పెంపుపై ఆగస్టు 13న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు నేడు సత్యభారతి ఫంక్షన్ హాల్లో సన్నాహక సమావేశం ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

అధికారులకు మెమో జారీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దోమ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదుకు వ్యవసాయ అధికారులు రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. రైతుల నుంచి ఏఈవో రూ.50 వసూలు చేయిస్తున్నాడని తెలియడంతో ఏఈవో హారిక, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెమో జారీ చేశారు. రెండు రోజుల్లో వచ్చిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు.

జిల్లా దిశ కమిటీ సభ్యుడిగా పరమేశ్వర్ రెడ్డి

వికారాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా దిశ చైర్మన్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు కమిటీ సభ్యుడిగా మిట్ట పరమేశ్వర్ రెడ్డిని నియమించారు. అంతకు ముందు సభ్యుడిగా ఉన్న ప్రస్తుత బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి జిల్లా బాధ్యతలు నిర్వర్తిస్తుండడంతో ఆయన స్థానంలో పరమేశ్వర్ రెడ్డిని నియమించారు. పూడూరు మండలం చీలాపూర్ గ్రామానికి చెందిన ఆయన సామాజిక అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధతతో జిల్లా అభివృద్ధిలో గణనీయంగా సేవలందిస్తారని ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



కేజీబీవీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

ఆ ప్రత్యేకాధికారి మాకొద్దు

మర్పల్లి కేజీబీవీ విద్యార్థినుల ఆందోళన

మర్పల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రత్యేకాధికారి తమకు వద్దంటూ మర్పల్లి కేజీబీవీ విద్యార్థినులు పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు. శనివారం అన్నంలో పురుగులు వస్తున్నాయని, ప్రత్యేకాధికారిణి ఇబ్బందులకు గురి చేస్తుందని విద్యార్థులు ఆందోళన చేయడంతో సోమవారం మండల ప్రత్యేకాధికారి మోహన్‌కృష్ణ, తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో రాజమల్లయ్య, ఎంఈవో అంజిలయ్య పాఠశాలను సందర్శించారు. ముందుగా భోజనం నాణ్యత, స్టాకును పరిశీలించి ఉపాధ్యాయులు, ప్రత్యేకాధికారితో సమావేశం నిర్వహించారు. వారు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో సమన్వయలోపం కారణంగానే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇక నుంచి పద్ధతి మార్చుకొని విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడగా ప్రత్యేకాధికారి వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని తెలిపారు. కాగా, ఇక నుంచి అలా జరగదని విద్యార్థులను సముదాయించారు. అయినా విద్యార్థులు వినకుండా ఆ అధికారి తమకు వద్దని, ఆమె ఉంటే తాము చదవలేమని వాపోయారు. వారం రోజులు సమయం ఇచ్చామని, ఇక నుంచి అలాంటి సమస్యలు ఉండవని ఎంత నచ్చజెప్పినా భీష్మించి కూర్చుకున్నారు. చివరికి విద్యార్థులు శాంతించి పాఠశాలలోకి వెళ్లారు. ఉపాధ్యాయులు, ప్రత్యేకాధికారి మధ్య సమన్వయ లోపం కారణంగానే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, ఇక నుంచి పద్ధతి మార్చుకోవాలని అధికారులు హెచ్చరించారు.

మూడు కళాశాలలకు కొత్త ప్రిన్సిపాళ్లు

వికారాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రిన్సిపాళ్లు నియామకమయ్యారు. జూనియర్ లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తున్న వారిలో సీనియర్లకు సోమవారం ప్రిన్సిపాళ్లుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని బొంరాస్‌పేట్ కళాశాలకు రోజారాణి, దౌల్తాబాద్ కళాశాలకు వసంత, హకీంపేట్ కళాశాలకు రమణకుమారిలకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు కల్పించి ప్రభుత్వం పోస్టింగులు కేటాయించింది. కాగా, జిల్లాలో గత రెండేళ్ల కాలంలో మంజూరైన నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, హకీంపేట్ కళాశాలలకు కాంట్రాక్టు లెక్చరర్లు, పూర్తి స్థాయి ప్రిన్సిపాళ్లు నియామకమయ్యారు. ఇటీవల జూనియర్ లెక్చరర్ల నియామకాల కంటే ముందుగా ఈ కళాశాలలకు పోస్టులు మంజూరు చేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడి ఉంటే ఆ కళాశాలలకు కూడా రెగ్యులర్ లెక్చరర్లు నియామకమయ్యేవారు. కాగా, బషీరాబాద్ కళాశాలకు మాత్రం ఇంకా ప్రభుత్వం పోస్టులు మంజూరు చేయలేదు. దీంతో సోమవారం జరిగిన ప్రిన్సిపాళ్ల పదోన్నతుల్లో ఈ కళాశాలకు ప్రిన్సిపాల్‌ను కేటాయించలేదు.

ఆలయాల నిర్మాణాలకు విరివిగా నిధులు

పర్యాటక ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేస్తాం

- పాంబండ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- రెండు బండలకు మధ్య రోప్‌వే నిర్మాణానికి కృషి
- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

పరిగి/కులకచర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, కాలనీల్లోని ఆలయాలు, కుల దేవతల దేవాలయాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆలయాలు, పర్యాటక ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆమె సోమవారం పరిగిలోని పోచమ్మ, మైసమ్మ ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకుముందు కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వన మహోత్సవంలో భాగంగా ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రతీ గ్రామంలో సీజీఎఫ్ కింద ఆలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పాంబండ ఆలయానికి స్థపతిని పంపించి కావాల్సిన అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. పాంబండపై కల్యాణ మంటపం,

మిగతా 8వ పేజీలో...



మొక్కలు నాటిన మంత్రి కొండా సురేఖ పక్కన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తదితరులు



ఘనంగా పోచమ్మ బోనాలు

పరిగి,జూలై 14 (ఆంధ్రజ్యోతి): పరిగి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం పోచమ్మ బోనాల ఉత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలను అందంగా తయారు చేసి తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు సమర్పించుకున్నారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో చేపల వల, ఫలహార బండి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

హస్తవ్యస్తం!



మేడ్చల్ కాంగ్రెస్‌లో అసంతృప్తి!

» పట్టించుకోవడం లేదని స్థానిక నేతల ఆందోళన
» అభివృద్ధి కార్యక్రమాలపై పెదవి విరుపు
» ఇన్‌చార్జి మంత్రి తీరుపై నారాజ్
» పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు

మేడ్చల్, జూలై 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్టీ అధికారంలో ఉన్నా తమని పట్టించుకునే నాథుడే లేడని మేడ్చల్ జిల్లాలోని నియోజకవర్గాల కాంగ్రెస్ ఇన్‌చార్జిలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇన్‌చార్జి మంత్రి తీరుపై నారాజ్ అవుతున్నారు. దీనికి తోడు వారు ఇన్‌చార్జి మంత్రి తీరుపై ఏకంగా పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో కాంగ్రెస్ ఒక్క అసెంబ్లీ స్థానం కూడా గెలుపొందలేదు. దీంతో ఓడిన అభ్యర్థులే అక్కడ పార్టీ ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. కాగా, అధికారంలో ఉన్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఇన్‌చార్జి మంత్రి కూడా ఇప్పటి వరకు ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించలేదు. ప్రభుత్వ కార్యకలాపాలు, పార్టీ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల్లోనూ సముచితమైన స్థానం లభించడం లేదని వాపోతున్నారు.

కనిపించని అభివృద్ధి

జిల్లాలో అంతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే కావడంతో ప్రొటోకాల్ ప్రకారం వారు అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కాగా, ఇన్‌చార్జి మంత్రి కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సహకరిస్తున్నట్లు ఆ పార్టీలో ప్రచారం జరుగుతుండటం గమనార్హం. దీంతో కాంగ్రెస్ నాయకులు అసంతృప్తికి లోనవుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నా అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదని ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్‌లో ఇలాంటివి సర్వసాధారణమైనా ఇన్‌చార్జి మంత్రిపై ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. కాగా, నేరుగా తాము మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసిన విషయం ఎలా లీకైందో తెలియక వారు ఆలోచనలో పడ్డారు.

దేవాలయాల భూములు ఆక్రమిస్తే చర్యలు

» దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్



కులకచర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆలయాల భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని దేవాదాయ శాఖ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం కులకచర్ల పాంబండ దేవాలయానికి వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. తాండూర్ సోమేశ్వర ఆలయ భూమి సర్వే నంబర్ 37లోని 5.27 ఎకరాల భూమిని పలువురు ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు రాగా విచారణ చేపట్టి తాము స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలో 467 దేవాలయాలు ఉన్నాయని, వాటి పరిధిలో 15,779 ఎకరాల భూములున్నాయన్నారు. అర్చకుల ఆధీనంలో 4,740 ఎకరాల భూమి ఉందని, 2,302 ఎకరాల భూమి రైతులకు కౌలుకు ఇచ్చామని తెలిపారు. వీటి ద్వారా సంవత్సరానికి రూ.60 లక్షలు ఆదాయం వస్తుందన్నారు. సాగుకు యోగ్యం కాని భూమి 3,035 ఎకరాలు ఉందని తెలిపారు. 4,481 ఎకరాలు వివాదాస్పదంగా కోర్టు పరిధిలో ఉందన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు


కొండాపూర్‌లో శంకుస్థాపన కార్యక్రమంలో వజ్రేష్, సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ నగర్, కొండాపూర్, గుంటిగూడెంలలో ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం వారు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో మహేష్‌గౌడ్, ముల్లి పావని, ముత్యాలు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: ఇందిరమ్మ రాజ్యమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాయరు విశ్వనాథం తెలిపారు. ఎదులాబాద్‌లో 11 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బింగి రాజేందర్‌గౌడ్, మెట్టు నర్సింహ, బొంత రాజిరెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

గురుకులంలో వసతులు కల్పించాలని ఆందోళన


బీసీ గురుకుల పాఠశాల ఎదుట బైఠాయించిన విద్యార్థులు

శామీర్‌పేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాలల్లో కనీస వసతుల్లేక, సరైన భోజనం లేక నరకయాతన అనుభవిస్తున్నామని గురుకుల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని తుర్కపల్లిలో నిర్వహిస్తున్న కూకట్‌పల్లి జ్యోతిబాఫూలే తెలంగాణ బీసీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం పాఠశాల ముందు, రాజీవ్ రహదారిలో ఆందోళన చేశారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు డౌన్ డౌన్ అని నినాదాలు చేస్తు బైఠాయించారు. గురుకులంలో సరైన వసతుల్లేవని ప్రిన్సిపాల్, అధ్యాపకులకు చెబితే తమను దూషిస్తున్నారని విద్యార్థులు తెలిపారు. నాణ్యమైన భోజన పెట్టడం లేదని, నీటి సమస్య ఉందని, అపరిశుభ్ర తాగు నీరు ఇస్తున్నారని, బాత్‌రూమ్‌లు సరిగ్గా లేవని చెప్పారు. సమస్యలపై రెండు నెలలుగా ప్రిన్సిపాల్‌కు, అధ్యాపకులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని, విద్యార్థులు వాపోయారు. నెలకోసారి మార్చాల్సిన ఫుడ్ మెనునూ మార్చడం లేదని, బాత్ రూమ్‌లకు డోర్లు లేవని, 500మంది విద్యార్థులకు రెండే వాష్‌రూములున్నాయని చెప్పారు. అధికారులు స్పందించి గురుకులంలో సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని విద్యార్థులు అన్నారు. కాగా విద్యార్థుల ఆందోళనకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు మద్దతిచ్చారు. ప్రభుత్వ గురుకులాల్లో సమస్యలన్నీ తీర్చుతున్నామని చెబుతున్న పాలకులు, అధికారులు మరి వీరి సమస్యలు ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


గెస్ట్ టాక్ కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ రైమల్

ఘట్‌కేసర్ రూరల్ జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ రైమల్ అన్నారు. ఘనాపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన గెస్ట్ టాక్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సివిల్ ఇంజినీరింగ్ రంగంలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రాజెక్ట్ నిర్వహణ, ప్రాక్టికల్ నాలెడ్జ్, ప్రాముఖ్యాన్ని తెలుసుకోవాలన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివితేనే ఫలితాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్లో అందించే భోజనం పట్ల నిర్లక్ష్యం వహించొద్దు


విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

మర్పల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే భోజనం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి కృష్ణ మోహన్ అన్నారు. ఆదివారం సిరిపూరం ఎస్సీ బాలుర హాస్టల్‌లో భోజనంలో పురుగులు వచ్చాయని విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బంది, వార్డెన్‌పై మండిపడ్డారు. సోమవారం ప్రత్యేకాధికారి, తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో రాజమల్లయ్య హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించని పక్షంలో చర్యలు తీసుకుంటామని హాస్టల్ వార్డెన్ తుల్జారాం, సిబ్బందిని హెచ్చరించారు.

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించాలి


వ్యవసాయ క్షేత్రంలో నాట్లు వేస్తున్న విద్యార్థులు

ఆదిభట్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు విద్యతో పాటు వ్యవసాయంపై అవగాహన కల్పించాలని శ్రీనివాస స్కూల్ చైర్మన్ శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం కొంగరకలాన్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థులకు వరినాట్లపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యపుస్తకాల్లో ఉండే బోధనలతో పాటు క్షేత్రస్థాయి పరిజ్ఞానం అవసరమన్నారు. తమ స్కూల్ విద్యార్థులకు ఏటా వరినాట్లపై, పంటలపై అవగాహన కల్పించి, వరి నాట్లు వేయిస్తున్నట్టు తెలిపారు. అనంతరం రైతులు పడే కష్టాలు, పంటలు పండించే కాలాల గురించి వివరించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్కరాజు రాధిక, టీచర్ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత


తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం పరిధి కీసరలో కమిషనర్ తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగహన కల్పించారు. షాపుల చెత్త రోడ్లపై వేయకూడదని దుకాణదారులను హెచ్చరించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. శివాజీ చౌరస్తా కాలనీ వాసులు తాగునీటి ఇబ్బందులు తీర్చాలని డ్రమ్ములు రోడ్డుపై పెట్టి నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన కమిషనర్ నీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయకుంటే ఆందోళనలే

షాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలుచేశాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ నాయకుడు నక్క శ్రీనివాస్‌గౌడ్, జడల రాజేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం షాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మభ్యపెట్టేందుకే బీసీ రిజర్వేషన్ల అంశంపై రోజుకో మాట మాట్లాడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్వకోల్ వెంకట్‌యాదవ్, నాయకులు పోనెమోని రమేష్‌యాదవ్, కమ్మరి శ్రీనివాస్, చాంద్‌పాషా, గణేష్‌గౌడ్, శేఖర్, దర్శన్, రాజుగౌడ్, ముక్రంఖాన్, ఇమ్రాన్, సురేష్‌గౌడ్, సత్తయ్య తదితరుల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఊరూరా మహిళా శక్తి సంబురాలు


కార్యక్రమంలో మహిళను సన్మానిస్తున్న అధికారులు

పెద్దేముల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలో ఊరురా ఇందిరా మహిళా శక్తి సంబురాల కార్యక్రమాన్ని సోమవారం జరుపుకున్నారు.ఐకేపీ కార్యాలయంలో మహిళలను సన్మానించారు. ఐకేపీ ఏపీఎం బాలయ్య మట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా ప్రభుత్వం ప్రతీ మహిళా సంఘానికి రూ.20లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తుందని తెలిపారు. మహిళల ఉపాధి కోసం చిరు వ్యాపారాలకు స్త్రీ నిధి రుణాలు ఇస్తుందని చెప్పారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంకుల నిర్వహణ, క్యాంటీన్లు, ఆర్టీసీ అద్దె బస్సులు, కిరాణషాపుల నిర్వహణకు రుణాలు ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇళ్లు నిర్మించుకోవాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


తుమ్మలపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చౌదరిగూడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం తుమ్మలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. 'ఇందిరమ్మకు ఇసుక కష్టాలు' శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇళ్ల నిర్మాణానికి స్టోన్‌డస్ట్ వాడుతున్నారని తెలిసి అధికారులు పరిశీలించారు. స్థానికంగా లభించే ఇసుకను ఉచితంగానే వాడుకోవచ్చని, ఇసుకతోనే నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

ఎన్నికల నిర్వహణలో బీఎల్వోలది కీలక పాత్ర


మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనునాయక్

కడ్తాల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణ, ఓటర్ లిస్టుల రూపకల్పనలతో బూత్ లెవల్ ఆఫీసర్లది కీలకపాత్ర అని కల్వకుర్తి ఆర్డీవో శ్రీనునాయక్ అన్నారు. బీఎల్‌వోలు ఎక్కడా అలసత్వానికి తావివ్వొద్దని సూచించారు. సోమవారం కడ్తాల్‌లోని రైతు వేదికలో బూత్ స్థాయి అధికారులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. బీఎల్‌వోలకు నియోజకవర్గ స్థాయి శిక్షకులు జంగయ్య, శ్రీనివాస్‌లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన రాఘవేందర్



కడ్తాల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కడ్తాలకు చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రామకృష్ణారావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్థానిక సమస్యలను సీఎస్ దృష్టికి తీసుకెళ్లినట్టు రాఘవేందర్ తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

చేవెళ్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్లలోని హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రవల్లి శ్రీనివాస్, అరుణ్‌కుమార్‌లు మాట్లాడుతూ... పెండింగ్‌లోని రూ. 8,700కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. విద్యాభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సమీర్, యశ్వంత్, చరణ్‌గౌడ్, చందు, తేజ, చిరంజీవి, ప్రశాంత్, ఆకాశ్, సోఫియాస్, మెసిన్, ఆజర్, వంశీ, సాయి పాల్గొన్నారు.


చేవెళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు



వీవీ వినాయక్‌తో స్థానికులు

శంకర్‌పల్లి ఎస్సార్వోకు డైరెక్టర్ వీవీ.వినాయక్ రాక

శంకర్‌పల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సోమవారం సినిమా డైరెక్టర్ వీవీ.వినాయక్ వచ్చారు. మొయినాబాద్ మండలం చిన్నమంగళారంలో తనకున్న 2,000 గజాల స్థలాన్ని వినాయక్ హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి విక్రయించారు. ఆ ప్లాట్ రిజిస్ట్రేషన్ నిమిత్తం వినాయక్ శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం వినాయక్ హైదరాబాద్ వెళ్లిపోయారు. కాగా కార్యాలయం వద్ద డైరెక్టర్‌తో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు యువకులు, స్థానికులు ఉత్సాహం చూపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోతుగంటి కృష్ణ

పింఛన్‌దారుల మహాసభను విజయవంతం చేయాలి

తలకొండపల్లి, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ఆమనగల్లులో నిర్వహించే చేయూత పింఛన్‌దారుల మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ అన్నారు. సోమవారం తలకొండపల్లిలో ఆసరా పింఛన్‌దారులు, దివ్యాంగుల సంఘం నాయకులతో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణ మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఆదేశాల మేరకు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు జంగయ్య, శ్రీకాంత్, గోపాల్, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

పురాతన వెండి ఆభరణాలు లభ్యం

» పాత ఇంటిని కూల్చుతుండగా బయల్పడిన వైనం

మర్పల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి పాత ఇంటిని తొలగిస్తుండగా పాత గోడల్లో 1.23కిలోల పరిమాణంలో పురాతన వెండి ఆభరణాలు లభ్యమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. బూచన్‌పల్లిలో లక్ష్మీపూరం జనార్ధన్‌రెడ్డికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణానికి అతడు శనివారం ఇంటిని జేసీబీతో కూల్చివేస్తుండగా వెండి కాళ్ల పట్టీలు, వడ్డాణం లభ్యమయ్యాయి. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకొని జనార్ధన్‌రెడ్డి ప్రశ్నించగా అతడు పురాతణ ఆభరణాలను పోలీసులకు అప్పగించాడు. స్వాధీనం చేసుకున్న వెండిని సోమవారం ఎస్ఐ గఫ్ఫార్ తహసీల్దార్ పురుషోత్తంకు అప్పగించారు. ఈ విషయమై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ తెలిపారు.



లభ్యమైన వెండి ఆభరణాలు



కిచెన్ గార్డెన్‌ను ప్రారంభిస్తున్న రాజిరెడ్డి, లీలాలక్ష్మారెడ్డి, రజనీకుమారి

కిచెన్ గార్డెన్‌తో మెరుగైన ఆరోగ్యం

» కొండా లక్ష్మణ్ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ దండర్ రాజిరెడ్డి

శంషాబాద్ రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందడం తోపాటు సరైన జీవన శైలి అలవాటవుతుందని కొండా లక్ష్మణ్ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ దండర్ రాజిరెడ్డి, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం శంషాబాద్ మండలంలోని పాలమాకుల మోడల్ స్కూల్‌లో యాంగ్ ఎర్త్ లీడర్స్, స్కూల్ ఎర్త్ క్లబ్స్ ఆధ్వర్యంలో కిచెన్ గార్డెన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రజనీకుమారి, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యు భగవాన్, చీనానాయక్, మహీధర, పంకజ్‌రెడ్డి, జీవీ.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయేందర్, సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, లక్ష్మీనర్సింహారెడ్డి

బీసీ రిజర్వేషన్లపై ప్రధానితో చర్చించని సీఎం

కందుకూరు, జులై14(ఆంధ్రజ్యోతి): బీసీల ఐక్యత వర్ధిల్లాలని, రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నె జయేందర్ ఆధ్వర్యంలో కందుకూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తరచూ ఢిల్లీ వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి బీసీల 42శాతం రిజర్వేషన్లపై ఒక్కసారైనా ప్రధానమంత్రితో చర్చించకంపోవడం వింతగా ఉందన్నారు. ఏ చట్టం ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్లిస్తారో చెప్పడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే దమ్ము లేకనే బీసీలకు 42శాతం రిజర్వేషన్లంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు డి.జంగయ్య, కె.సదానందగౌడ్, అశోక్, శ్రీహరి, పర్వతాలు, తాళ్ల కార్తీక్, తిరుపతయ్య, ప్రశాంత్‌చారి, శివలింగచారి, రాజు, నర్సింహ, సత్తయ్య పాల్గొన్నారు.

ఆషాఢం.. మహిళల మురిపెం

కొడంగల్ రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం వచ్చిందంటే మహిళలు, యువతులు, చిన్నారులు చేతులు, కాళ్లకు గోరింటాకు పెట్టుకోవడం సంప్రదాయం. అరచేతిలో ఎర్ర మందారంలా పండి, తన బతుకును పండించే మంచి భర్త రావాలని యువతులు గోరింటాకు పెట్టుకుంటారు. చేతులు, పాదాలను ఎరుపెక్కించే గోరింట.. అందంతో పాటు ఆరోగ్యాన్నీ ప్రసాదిస్తుంది. అందుకే గోరింటాకంటే ఇష్టపడని మహిళలు ఉండరు. గోరింట లేత ఆకులను రోలులో రుబ్బి చేతులకు, పాదాలకు పెట్టుకుంటారు. కొన్ని గంటల్లోనే ఎర్రగా పండి చేతులు, కాళ్లకు వన్నె తెస్తుంది. అయితే ప్రస్తుతం చాలా మంది రెడీమేడ్ కోన్ మెహందీని వాడుతున్నారు. పల్లెల్లో మాత్రం ఇప్పటికీ పాత సంప్రదాయం ప్రకారమే గోరింటాకును రోలులో రుబ్బి చేతులు, పాదాలకు పెట్టుకుంటున్నారు.

ఈ కాలంలోనే ఎందుకంటే..?

ఆషాఢ అంటేనే వర్షా కాలం. ఈ సమయంలో నేలంతా బురద మయంగా ఉంటుంది. నిత్యం ఇంటి పనుల్లో తలమునకలయ్యే మహిళలు తడి నేలపై పదేపదే తిరుగుతారు. దీంతో నేలలో ఉండే తేమతో మహిళల చేతులు, కాళ్లు ఒరిసిపోయి గోళ్లు దెబ్బతింటాయి. ఇలా వచ్చే కొన్ని సమస్యలకు గోరింటాకు విరుగుడుగా పనిచేస్తుందని నమ్మకం. అలాగే శరీరంలోని వేడిని తగ్గించేందుకు సైతం గోరింట దోహదపడుతుంది.



కొడంగల్‌లో గోరింటాకు వేడుక నిర్వహిస్తున్న మహిళలు

వడివడిగా బ్రిడ్జి పనులు

» ఘట్‌కేసర్‌లో జాతీయ రహదారిపై ట్రాఫిక్ డైవర్షన్ కోసం రోడ్ల నిర్మాణం

» వాహనదారులకు తొలగనున్న తిప్పలు

» హైవే దాటేందుకు తీరనున్న ఇబ్బందులు

ఘట్‌కేసర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని ఔటర్ జంక్షన్ వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఘట్‌కేసర్‌లోని యంనంపేట్ చౌరస్తా వద్ద హైదరాబాద్-వరంగల్ హైవేను దాటేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యలూ తలెత్తుతున్నాయి. హైవేను దాటే సమయాల్లో ఇక్కడ ఎన్నోప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎంపీలు కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్‌లకు తెలుపగా వారు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరి దృష్టికి తీసుకుపోయారు. దీంతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు పరిశీలించి ఒక బ్రిడ్జి, మూడు వీయూపీ(వెహికిల్ అండర్ పాస్)ల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూ.102కోట్లతో పనులు చేపట్టారు. హైదరాబాద్-వరంగల్ రహదారిని దాటేందుకు ఇరు పక్కల వాహనదారులకు ఇబ్బందుల్లేకుండా బ్రిడ్జి నిర్మాణానికి రూపకల్పన చేశారు. ఘట్‌కేసర్ వైపునకు వెళ్లాల్సిన వాహనాలు ఘట్‌కేసర్ వైపు, హైదరాబాద్ వైపునుంచి వరంగల్ వెళ్లే వాహనాలు జాతీయ రహదారిపైకి చేరుకునేలా ప్రణాళిక రూపొందించారు.



ఘట్‌కేసర్ ఔటర్ జంక్షన్‌లో వాహనాల డైవర్షన్ కోసం రోడ్డు పనులు



చేపడుతున్న పనులపై ఆరా తీస్తున్న ఎంపీ కె.లక్ష్మణ్(ఫైల్)

ప్రమాదాలు తగ్గే అవకాశం

హైవేపై బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ పూర్తికావడంతో కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. మొదట వాహనాలను మళ్లించేందుకు రెండు వైపులా అండర్ పాస్‌లను వేస్తున్నారు. బ్రిడ్జి నిర్మించే ఔటర్ సమీపం నుంచి పనులు చేపట్టారు. మైసమ్మగుట్ట కాలనీకి వెళ్లేందుకు ఈద్గా సమీపంలో అండర్ పాస్, అవుషాపూర్ వాసులు హైవేను దాటేందుకు గ్రామ చౌరస్తా వద్ద మరో వీయూపీ నిర్మిస్తారు. అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద నిర్మించే అండర్‌పాస్‌తో ప్రజలకు ఇబ్బందులు తీరుతాయి. ఇక్కడ జాతీయ రహదారిపై జరిగిన అనేక ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. అండర్‌పాస్‌తో ఘనాపూర్, పక్కీర్‌టెక్యా, లింగాపూర్ ఆర్జీకే కాలనీ, దివ్యాంగులకాలనీ, మోడీ కాలనీ, పలు విద్యాసంస్థల విద్యార్థుల వాహనాలు సురక్షితంగా హైవేను క్రాస్ చేసే వీలు కలుగుతుంది. బ్రిడ్జి, మూడు అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తయితే ఇక్కడ ప్రమాదాలు తగ్గుతాయి.

ట్రాఫిక్ ఇబ్బందులు తీరుతాయి



ఘట్‌కేసర్‌లోని ఔటర్ జంక్షన్ వద్ద నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్నాం. పండుగలు, సెలవు దినాల్లో అయితే ట్రాఫిక్ మరింత తీవ్రంగా ఉంటుంది. క్రాసింగ్ సమయాల్లో హైవేపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మైసమ్మగుట్టకాలనీ చౌరస్తా, అన్నోజిగూడ ఎన్టీపీసీ చౌరస్తాలు ప్రమాద జోన్లుగా మారాయి. బ్రిడ్జి, అండర్ పాస్‌ల నిర్మాణాలతో ఇబ్బందులు తీరుతాయి.

- ఎంబీఆర్.రాజు, శివారెడ్డిగూడ, ఘట్‌కేసర్

ఎంపీల సహకారంతోనే బ్రిడ్జి మంజూరు



ఘట్‌కేసర్‌లోని ఔటర్ చౌరస్తా, అన్నోజిగూడ ఎన్టీపీసీ చౌరస్తా, మైసమ్మగుట్ట కాలనీ చౌరస్తా, అవుషాపూర్‌ల వద్ద అనేక ప్రమాదాలు జరిగి పలువురు చనిపోయారు. ఈ సమస్యపై ఎంపీలు కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్‌ల సహకారంతో పలుమార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి సమస్యను వివరించాం. కేంద్రం నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి.

- ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు

కల్లు దుకాణాల్లో ఎక్సైజ్ తనిఖీలు

యాచారం/వికారాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగి కొందరు మరణించిన నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు కల్లు దుకాణాల తనిఖీలను ముమ్మరం చేశారు. సోమవారం యాచారం మండల పలు గ్రామాల్లో దుకాణాలను తనిఖీ చేశారు. చెట్ల నుంచి తీసిన కల్లు విక్రయిస్తున్నట్టు తమ పరీక్షల్లో తేలిందని ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ సీఐ సీతారాం రెడ్డి తెలిపారు. కల్లు తయారీదారులు, డిపో నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, కల్తీకల్లు, రసాయనాలు కలిపిన కల్లును విక్రయించొద్దని వికారాబాద్ ఎక్సైజ్ సీఐ రాఘవీణ తెలిపారు. పట్టణంలోని కల్లు డిపోను తనిఖీ చేశారు. కల్లు క్లోరల్ హైడ్రేడ్ రహితంగా ఉందని నిర్ధారించారు. రెండు సీసాల శాంపిళ్లను సేకరించి అండర్ రూల్-27 ప్రకారం కేసు నమోదు చేశామని తెలిపారు. శాంపిళ్లను టెస్టుల కోసం నారాయణగూడ ల్యాబ్‌కు పంపుతామన్నారు. కల్లుతో మత్తుపదార్థాలు వాడినట్లు నిర్ధారణైతే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ.. ధారాసింగ్‌కు నోటీసులు

తాండూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా ఈ నెల 15వ తేదీన హాజరుకావాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌కు జూబ్లీహిల్స్ డివిజన్ అసిస్టెంట్ పోలీస్‌కమిషనర్ వెంకటగిరి నోటీసులు జారీ చేశారు. గతంలో విచారణకు రావాలని ఫోన్ ద్వారా జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ నుంచి పిలుపు వచ్చినప్పటికీ నోటీసేమీ రాలేదనే ఉద్దేశంతో ధారాసింగ్ విచారణకు వెళ్లలేదు. 2023 శాసనసభ ఎన్నికల ముందు ఆయన ఫోన్ ట్యాప్ అయినట్టు అధికారులు గుర్తించడంతో తాజాగా నోటీసులు జారీ చేశారు.

షాబాద్ బాలుర పాఠశాల హెచ్ఎంపై చర్యలు

» విద్యార్థిని బూటు కాలితో తన్నిన హెచ్ఎం గోవింద్

» విచారణకు ఆదేశించిన డీఈవో

షాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆరో తరగతి విద్యార్థిని చితకబాది, బూటు కాలితో తన్నిన షాబాద్‌లోని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవింద్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు తెలిపారు. ఈ నెల 11న విద్యార్థిని చితకబాదిన సంఘటనతో బాలుడి కుటుంబీకులు, కొందరు గ్రామస్తులు సోమవారం పాఠశాలకు చేరుకొని.. 'ఈ హెచ్ఎం మాకొద్దు.' అని నినాదాలు చేశారు. హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని డీఈవోకు ఫోన్ చేయగా ఆయన పాఠశాలకు చేరుకొని గ్రామస్తులతో చర్చించారు. అనంతరం డీఈవో విలేకరులతో మాట్లాడుతూ.. హెచ్ఎం గోవింద్‌పై ఇప్పటికే చాలా ఫిర్యాదులొచ్చాయని, పాఠశాల ఫర్నిచర్ విక్రయించాడని, ఆరో తరగతి విద్యార్థిని బూట్ కాలితో తన్ని హింసించాడని గ్రామస్తులు ఫిర్యాదు చేశారని డీఈవో తెలిపారు. ఆరోపణలపై హెచ్ఎం గోవింద్‌ను వివరణ కోరగా పొంతన లేని సమాధానాల చెప్పాడని డీఈవో చెప్పారు. అతడి చర్యలపై విచారణకు ఆదేశించామన్నారు. అతడి తప్పులు తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అప్పటి వరకు ఇన్‌చార్జి హెచ్ఎంగా వేరొక ఉపాధ్యాయుడిని నియమిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డీఈవో పట్టణంలోని బాలికల పాఠశాలను సందర్శించి టీచర్లు సమయపాలన పాటించాలని సూచించారు. ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఈవో వెంట ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.



పాఠశాల వద్ద నినాదాలు చేస్తున్న గ్రామస్తులు



మాట్లాడుతున్న డీఈవో సుశీందర్‌రావు



ఎమ్మెల్యే, మధుసూదన్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

కాంగ్రెస్ పాలనలోనే సమన్యాయం

షాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేకూరుతుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం హైతాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు 50మంది నాయకులు ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే పేదలకు, అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందన్నారు. దశలవారీగా హామీలన్నీ అమలు చేస్తున్నట్టు చెప్పారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని తెలిపారు. స్థానిక సంస్థ ఎన్నికలకు సన్నద్ధం కావాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ కె.చంద్రశేఖర్, నాయకులు జనార్దన్‌రెడ్డి, లింగం, ఖాజామియా, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం

తాండూరు రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి):రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర మీడియా సెల్ అధికార ప్రతినిధి పంజుగుల శ్రీశైల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం తాండూరులో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడొచ్చినా కార్యకర్తలందరూ ఐక్యంగా ఉంటూ బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఏ పల్లెకు వెళ్లినా కేసీఆరే మళ్లా సీఎం కావాలంటూ చర్చించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో గ్రామంలోనూ అభివృద్ధి జరగడం లేదన్నారు. క్షేత్ర స్థాయిలో నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో మోసాలు, అన్యాయాలతో విసిగిపోయిన ప్రజలు ఆ పార్టీని చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో తాండూరు మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీల, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ మహిళా కన్వీనర్, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి



బీఆర్ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

కాంగ్రెస్‌వి ప్రజా వ్యతిరేక విధానాలు

చేవెళ్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని పార్టీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖానాపూర్, ముడిమ్యాల్ తదితర గ్రామాల బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ కార్తీక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానలను అవలభిస్తుందన్నారు. కాంగ్రెస్ పాలనతో విసిగిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. అన్ని ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచేలా కార్యకర్తలు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి. కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నియోజకవర్గ మాజీ కన్వీనర్ డి.ఆంజనేయులు, నాయకులు శేరి శివారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గోనె కరుణాకర్‌రెడ్డి, వనం మహేందర్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, మాధవరెడ్డి, బి.నర్సింలు, నరేందర్‌రెడ్డి, కృష్ణ, టి.చంద్రశేఖర్, ఆంజనేయులుగౌడ్, నారాయణ, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్ మోడల్ స్కూల్‌లో హెచ్‌బీటీల పంచాయితీ

» ఆరేళ్లుగా పనిచేస్తున్న తమను తొలగించారని ఆవేదన

బషీరాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): అవర్ బేస్డ్ టీచర్(హెచ్‌బీటీ)ల ఎంపికలో అక్రమాలు జరిగాయని పలువురు హెచ్‌బీటీలు బషీరాబాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనీలతో సోమవారం గొడవకు దిగారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఎనిమిది మందిని తొలగించి కొత్తగా హెచ్‌బీటీలను ఎలా తీసుకుంటారని లక్ష్మణ్ తదితరులు ప్రశ్నించారు. ఇక్కడ పనిచేస్తున్న తమను యేటా రెన్యూవల్ చేశారని, ఈ సారి కొత్త విధానమా; అని ప్రిన్సిపాల్‌తో పలువురు హెచ్‌బీటీలు వాదనకు దిగారు. తాము కూడా గతంలో డెమో క్లాసులు, ఇంటార్వ్యులతోనే ఉద్యోగాల్లోకి వచ్చామని, మరి ఎందుకు తీసేస్తున్నారని ప్రశ్నించారు. అర్హత లేకున్నా కొత్త వారిని తీసుకున్నారని, ఎంపికలోనూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఇక్కడ పనిచేసిన వారు కొందరు స్వచ్ఛందంగానే వెళ్లిపోయారని ప్రిన్సిపాల్ చెప్పగా.. ఉన్న వాళ్లం ఉద్యోగం చేస్తామంటే ఎందుకు అవకాశం ఇవ్వరని కొందరు అడిగారు. దీంతో ప్రిన్సిపాల్ స్పందిస్తూ.. గతంలో ఇక్కడ రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకే నిబంధనల మేరకు యేటా రిక్రూట్మెంట్ చేపట్టక పాత వారికే రెన్యూవల్ చేశారని సమాధానం చెప్పారు. తాను నిబంధనల మేరకే కొత్త హెచ్‌బీటీలను తీసుకున్నామని చెప్పారు. కాగా ఏళ్లుగా పనిచేస్తున్న తమను విధుల్లోంచి తొలగించిన ప్రిన్సిపాల్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పాత హెచ్‌బీటీలు తెలిపారు.



తమ ఉద్యోగాలపై బషీరాబాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తున్న పాత హెచ్‌బీటీలు

పశువైద్యశాల ఉద్యోగికి రైతుల సన్మానం

కేశంపేట, జూలై 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన పశుసంవర్ధక శాఖ ఉద్యోగి రాజీవ్ పైలట్‌ను సోమవారం నిర్దవెల్లి రైతులు సన్మానించారు. గ్రామ పశువైద్య శాల పరిధిలో సేవలందిస్తున్న రాజీవ్ పైలట్ ఇటీవల నిర్వహించిన తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరీ అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తమ గ్రామంలో విధులు నిర్వహిస్తున్న రాజీవ్‌కు ఉద్యోగ సంఘంలో జిల్లా అధ్యక్ష పదవి దక్కడంతో రైతుల ఆనందం వ్యక్తం చేసి ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రైతులు దిద్దెల ముత్యాలు, పద్మోజీ, నిరంజన్, మహేందర్, బాలరాజ్, బుచ్చయ్య, శంకర్ పాల్గొన్నారు.

కవిత శాసన మండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలి



కవిత దిష్టిబొమ్మ దహనం చేస్తున్న తీన్మార్ మల్లన్న టీమ్

వికారాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తీన్మార్ మల్లన్నపై ఎమ్మెల్సీ కవిత దాడి చేయించారని, ఆమెను వెంటనే శాసన మండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని తీన్మార్ మల్లన్న టీం సభ్యులు డిమాండ్ చేశారు. వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో సోమవారం ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. తెలంగాణ ఉద్యమంలో కవిత లేదని, తీన్మార్ మల్లన్న తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతంగా ముందుకు తీసుకెళ్లారని గుర్తుచేశారు.

రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గం చెరువు మల్లేశం

బంట్వారం జూలై14(ఆంధ్ర జ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దుర్గం చెరువు మల్లేశం అన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్ ఆదేశాల మేరకు సోమవారం బంట్వారం మండల కేంద్రంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరుల బీసీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాగైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని ఉద్దేశంతో బీసీలకు రిజర్వేషన్లు ముందుకు తీసుకువచ్చారన్నారు. వాళ్ళు ఏం చేసినా గ్రామాల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అత్యధికంగా స్థానాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సింహులు, ఖాజాపాషా, అనంతి, రవీందర్, భీమ్ కుమార్, బల్వంత్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, అంతిరెడ్డి, వీరేశం, మౌలానా, నరేష్‌లు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు హర్షణీయం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వజ్రేష్ యాదవ్

ఘట్‌కేసర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రి మండలి తీర్మానించడం చరిత్రాత్మకమని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లను కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ గౌడ్, ముత్యాలు, రాధాకృష్ణ, సహకార సంఘం చైర్మన్ ఎస్. రాంరెడ్డి, పావని, ప్రభాకర్‌రెడ్డి, రూప్‌సింగ్ నాయక్, అంజిరెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా ఎమ్మార్పీఎస్



మాట్లాడుతున్న నర్సింహులు

తాండూరు రూరల్, జూలై 14, (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడి పోరాటం చేస్తుందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు పులుసు మామిడి నర్సింహులు అన్నారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జినుగుర్తిలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తాండూరు మండల ఇన్‌చార్జి జగదీశ్ మాదిగ, బి.మాణిక్యం మాదిగ, బి.దేవదాస్ మాదిగ, వి.మొగులప్ప, బీజే గోవింద్, బి.దేవప్ప, రాజేష్ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ధారూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దోర్నాలలో పంచాయతీ భవనం సమీపంలో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని నిలిపివేయించాలని సోమవారం స్థానికులు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారిలకు ఫిర్యాదు చేశారు. కమ్మరి మోహన్ గ్రామ పంచాయతీ భవనంకు దగ్గర ఇంటినిర్మాణం చేపట్టాడని వారు తెలిపారు. ఈస్థలం సర్వేనంబరు 25లోని ప్రభుత్వంలో ఉందని, విద్యుత్ స్తంభాలను తొలగించి ఇంటి నిర్మాణం కొనసాగిస్తున్నాడని వారు చెప్పారు. గత ఏప్రిల్ 25న ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శికి ఇంటి నిర్మాణంపై ఫిర్యాదు చేశామని, స్థలాన్ని సర్వే చేయించాలని తహసీల్దార్‌ను కోరినా స్పందించడంలేదన్నారు. విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న వెంకట్‌రెడ్డి, నాయకులు

దౌల్తాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరన్న, నాయకులు జంగం వీరన్న, కురుమని దస్తప్ప, రొయ్యల భీములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కీసర: వన మహోత్సవంలో భాగంగా సోమవారం నాగారం పరిధిలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు మొక్కలు నాటి, వృక్షాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ నాటికను ప్రదర్శించారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ప్రిన్సిపాల్ సంతోష్ తెలిపారు.

సన్నాలకు బోనస్ ఏది?

- కొనుగోళ్లు ముగిసి రెండు నెలలు పూర్తి
- రైతులకు తప్పని ఎదురుచూపులు
- జిల్లాకు రావాల్సిన బోనస్ రూ.4.46 కోట్లు



సన్నరకం వరిధాన్యం కొనుగోళ్లు (ఫైల్)

పరిగి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో జిల్లాలో సాగు విస్తీర్ణం పెరిగింది. అయితే బోనస్ ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. ధాన్యం కొనుగోళ్లు పూర్తయి రెండు నెలలు గడిచింది. ధాన్యం డబ్బులు ఒకటీ రెండు రోజుల్లో జమయ్యాయి. అయితే బోనస్ డబ్బులు మాత్రం జమ కాకపోవడంతో రైతులు నిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో నిత్యం బ్యాంకుల వద్దకువెళ్లి బోనస్ డబ్బుల విషయమై ఆరాతీస్తున్నారు. జిల్లాలో దాదాపు 1200 మంది రైతుల దగ్గర జిల్లాలో 89,210 క్వింటాళ్ల సన్నరకం వరిధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో రైతులు విక్రయించిన సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500ల చొప్పున మొత్తం రైతులకు రూ.4.46 కోట్లు జమ కావాల్సి ఉంది. ఇప్పటి వరకు ఏ ఒక్క రైతు ఖాతాల్లో కూడా జమ కాలేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సన్నరకం ధాన్యానికి బోనస్ డబ్బులు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

త్వరలోనే జమవుతాయి

సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500ల బోనస్ ఇవ్వడంలో కొంత జాప్యం జరిగింది. అయినా బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేసే ప్రక్రియ జిల్లాలో ఇప్పటికే ప్రారంభమైంది. త్వరలోనే రైతులందరికీ జమ అవుతాయి. రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

\- సుదర్శన్, డీఎస్‌వో, వికారాబాద్

బోనస్ ఎప్పుడిస్తారు?



ప్రభుత్వం సన్నవడ్లను పండిస్తే క్వింటాలుకు రూ.500ల బోనస్ ఇస్తామని చెప్పింది. నేను సన్నరకం సాగు చేసి, 90క్వింటాళ్ల ధాన్యాన్ని రెండు నెలల కిందట విక్రయించాను. ధాన్యం డబ్బులు వచ్చాయి. కానీ క్వింటాలుకు ఇచ్చే రూ.500 బోనస్ ఇంత వరకు జమ కాలేదు. నాకు రూ.45 వేలు పడాల్సిఉంది. అధికారులు స్పందించాలి.

\- టి.ప్రదీప్‌రెడ్డి, పరిగి, వికారాబాద్ జిల్లా

బడికి బ్రాడ్‌బ్యాండ్!

(ఐదో పేజీ తరువాయి)

హర్షం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డిజిటల్ ఇనిషియేటివ్(డీఐ)కు అధిక ప్రాధాన్యత ఉండనున్న నేపథ్యంలో ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విద్యా బోధనలో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ పాఠ్యాంశాలను బోధించడం ద్వారా విద్యార్థులు సులభంగా అవగాహన పెంపొందించుకోవడమే కాకుండా వారికి నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

విడతల వారీగా అన్ని స్కూళ్లకు..

ఈ ఏడాది ప్రతిపాదించిన పాఠశాలలతో పాటు మిగిలిన ఇతర అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలలకు సైతం బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం కల్పించనున్నారు. ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు(ఐఎఫ్‌పీబీ) ద్వారా విద్యార్థులకు బోధించాలంటే బ్రాడ్‌బ్యాండ్ తప్పనిసరి. మొదట జిల్లాలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డులు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సదుపాయం ఉన్న పాఠశాలలను బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం కోసం ప్రతిపాదించారు. అయితే ఇతర పాఠశాలలను కూడా ప్రతిపాదించాలని సంబంధిత ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మరో జాబితా పంపించారు. రెండు విడతల్లో పంపిన ప్రతిపాదనల్లో మొత్తం 581 విద్యాశాఖ అజమాయిషీలో కొనసాగుతున్న పాఠశాలలు ఉన్నాయి. ప్రతిపాదించిన పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాలలతో పాటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు ఉన్నాయి. 354 ప్రాథమిక, 27 ప్రాథమికోన్నత, 175 ఉన్నత పాఠశాలలతో పాటు 9 మోడల్ స్కూళ్లు, 16 కేజీబీవీల్లో బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం కల్పించాలని ప్రతిపాదనలు పంపించారు. ఈ సదుపాయంతో విద్యార్థులకు డిజిటల్, ఏఐ బోధన మెరుగుపడనుంది. సమగ్ర శిక్ష ద్వారా త్వరలోనే ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు బ్రాడ్ బ్యాండ్ సౌకర్యం కల్పించే దిశగా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఆలయాల నిర్మాణాలకు విరివిగా నిధులు

(ఐదో పేజీ తరువాయి)

అన్నదాన సత్రం, తాగునీటి వసతి, రెండు గుట్టలపై కోవ్వే నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.

పర్యాటక కేంద్రంగా పాంబండ

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పాంబండ ఆలయాన్ని అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. పరిగి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ దేవాలయాల నిర్మాణాలకు దేవాదాయ శాఖ నుంచి రూ.1 కోటి 14 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, దేవాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, ఈఈ ఉమేశ్, పరుశరాంరెడ్డి, ఆంజనేయులు, లాల్‌కృష్ణ, హన్మంత్ ముదిరాజ్, కృష్ణ, మొగులయ్య, మహిపాల్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, భరత్‌కుమార్, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథాకు చెక్



కుళాయికి ఏర్పాటు చేసిన ఆన్‌ఆఫ్ సిస్టం

బషీరాబాద్, జూలై 14(ఆంధ్రజ్యోతి): 'తాగునీరు వృథా!' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి బషీరాబాద్ ఎంపీవో జయకర్ స్పందించారు. గౌళిగల్లిలో ఆన్ ఆఫ్ సిస్టం సరిగా లేక గంటల తరబడి కుళాయి నీరు వృథాగా పోతుండటంతో పంచాయతీ సిబ్బందిని అక్కడి పంపించి కుళాయికి ఆన్ ఆఫ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయించారు. ఎట్టకేలకు పంచాయతీ అధికారులు నీటివృథాకు అడ్డుకట్ట వేయడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఊరికో ఇంకుడు గుంత



ఇంకుడు గుంత నమూనా

బషీరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఊరికో ఇంకుడు గుంత నిర్మాణానికి చర్యలు చేపట్టబోతున్నట్లు బషీరాబాద్ ఎంపీడీవో విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రధాన మురుగు కాల్వల నుండి పారే నీటిని ఇంకుడు గుంతలకు మళ్లించేందుకు ఎస్‌బీఎం(స్వచ్ఛ భారత్ మిషన్) కింద నిధులు వ్యయం చేస్తున్నట్లు వివరించారు. ఒక్కో ఇంకుడు గుంతకు రూ.92 వేలు వ్యయం చేస్తున్నట్లు చెప్పారు. పంచాయతీల కార్యదర్శులకు ఇంకుడు గుంతలకు స్థలాలను గుర్తించాలని ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు.

స్పీకర్ సహకారంతో నూతన బోరు



బోరు వేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోమిన్‌పేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో నూతన బోరును వేయించినట్లు కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వారాల సిరాజుద్దీన్ తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి సోమవారంమండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ కాలనీలో ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన బోరు వేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఏజాజ్ పటేల్, సోమారపు రవి, హాజీ, తాజుద్దీన్, మోసిన్, ముజ్జు పాల్గొన్నారు.

అన్నదాతలకు ఐడీ నంబర్లు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) అన్నదాతలకు గుర్తింపు కార్డులు (ఐడీ కార్డులు)ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా ఘట్‌కేసర్ మండలంలో అన్నదాతలకు వారంరోజులుగా ఐడీకార్డుల ప్రక్రియ కొనసాగుతోంది. మండలంలో 7,070మంది ఉండగా ఇప్పటి వరకు 1502 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్నట్లు మండల వ్యవసాయాధికారి లావణ్య తెలిపారు. ఈ ఐడీ కార్డులు కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకునేలా ఉపయోగపడతాయని తెలిపారు.

'కలెక్టర్‌ను కలవనివ్వాలి'

మేడ్చల్ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల యూనియన్ నేతలను జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలవనివ్వాలని కోరుతూ సోమవారం మేడ్చల్ పట్టణ ఐఎన్‌టీయూసీ నాయకులు ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్న వారికి డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించాలని, రాజీవ్ యువ వికాసం పథకం ద్వార తమకు రుణాలు అందించాలని యూనియన్ నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు విజైరావు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలి

శామీర్‌పేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్‌లోని, తూంకుంట రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు-332, 286లలోని 8 ఎకరాల 4 గుంటల భూమిని కొందరు అక్రమార్కులు 2017లో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం బాధితులు, కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూకబ్జాకు పాల్పడి వెంచర్ చేసి దాంట్లో 133 పాట్లు చేసి అమ్ముకున్నట్లు బాధితులు వివరించారు. అధికారులు, పోలీసులు వెంటనే న్యాయవిచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

పంచాయతీ భూములను ప్రైవేట్ సంస్థకు అప్పగించొద్దు

దోమ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): హరిత సౌభాగ్యం పేరుతో గ్రామ పంచాయతీ భూములను ప్రైవేట్ సంస్థకు అప్పగించొద్దని సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి కోరారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఎకోలాజికల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ముప్పయి ఏళ్ల పాటు పంచాయతీ భూములను హరిత సౌభగ్యం పేరుతో అప్పగించేందుకు ఆ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు తెలిపారు. పంచాయతీ పాలకవర్గాలు ఏర్పడక ముందే ప్రత్యేక అధికారులతో గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేసుకోవాలని పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ఆదేశాలు జారీ అవుతున్నట్లు సమాచారం ఉందన్నారు. ఈ నిర్ణయంతో గ్రామీణ ప్రాంత పంచాయతీల హక్కులను కాలరాయడమే అన్నారు. పంచాయతీ భూములను అప్పగించడంలో ప్రభుత్వం పునరాలోచించాలన్నారు.

క్రైం కార్నర్

మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్య



నవీన్ (ఫైల్)

దుద్యాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుద్యాల మండలంలోని హస్నాబాద్‌లో జరిగింది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చాకలి వెంకటమ్మ, ఇస్వప్పలకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు నవీన్(24) గత కొన్ని రోజుల కిందట బైక్‌పై దూర ప్రాంతాలకు వెళ్లి వచ్చాడు. బైక్‌పై ఎక్కువ దూరం ప్రయాణం చేయడం సరైంది కాదని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు నవీన్‌ను మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ సోమవారం గ్రామ సమీపంలోని తమ పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

దోమ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన పురుగుల మందు సేవించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన దోమ మండలంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన వెంకటయ్య, బాలమణి దంపతులకు శ్రీకాంత్(27) ఏకైక కుమారుడు కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 12న శనివారం రాత్రి సమయంలో కడుపునొప్పి తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి చెంది ఊటుపల్లి గ్రామ శివారులో ఓవ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శ్రీకాంత్‌ను పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడు డిగ్రీ వరకు చదువుకున్నాడు. కుటుంబసభ్యులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

మట్టిని తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

దోమ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ఐదు టిప్పర్లు, జేసీబీని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్‌పాష తెలిపారు. ఊటుపల్లి గ్రామ సమీపంలోని అసైన్డ్ భూముల్లో నుంచి పరిగికి అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం మేరకు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించి టిప్పర్‌లు, జేసీబీని పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.

ధారూరు మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా దేవేందర్‌రెడ్డి

ధారూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బి.దేవేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. డిప్యూటేషన్ రద్దు కావటంతో ఆయన ఇక్కడ జాయిన్ అయ్యారు. కాగా ధారూరు, నాగారం, అంపల్లి, గురుదోట్ల, కొండాపూర్‌కలాన్, దోర్నాల్, హరిదాసుపల్లి, గడ్డమీది గంగారం, నర్సాపూర్, అల్లీపూర్, రుద్రారం, ఎబ్బనూర్, మోమిన్‌కలాన్, కుక్కింద, ధర్మాపూర్, తరిగోపుల, నాగసమందర్, రాజాపూర్ రెవెన్యూ గ్రామాల బాధ్యతలను అదనపు ఆర్ఐ దేవేందర్‌రెడ్డికి ఇచ్చారు. మరో ఆర్ఐ స్వప్నకు అల్లాపూర్, అంతారం, బాచారం, బూర్గుగడ్డ, చింతకుంట, గట్టేపల్లి, కాచారం, కెరెల్లి, కొండాపూర్‌కుర్దు, కుమ్మర్‌పల్లి, మైలారం, అవుసుపల్లి, మోమిన్‌కుర్దు, నాగసాన్‌పల్లి, రాంపూర్ మున్నూర్ సోమారం గ్రామాలను కేటాయించారు.

నిరుపేదల కోసమే ఉచిత కంటి వైద్యశిబిరం



ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యాలాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కోసం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు యాలాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మొగులయ్య, రమేష్ అన్నారు. రాస్నం గ్రామంలో సోమవారం హైదరాబాద్ శంకర ఆసుపత్రి, ఎస్ఎస్ఆర్ యువసేనా సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించగా, మొగులయ్య యువ నాయకుడు ఆశప్పతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 100 మందికిపైగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకోగా, 25 మందిని ఆపరేషన్ల కోసం రెఫర్ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ చేయించుకునే వారికి ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంగమేశ్వర్, విజయ్, సచిన్, బలరాం, గాజుల మన్నన్, మల్లారెడ్డి, ఎంకేపల్లి సాయన్న, ఖాజా పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో రోడ్లకు మోక్షం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న వడ్ల నందు

వికారాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ నిధులతో, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కృషితో నియోజకవర్గంలోని పలు రోడ్లకు మోక్షం లభించిందని బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు అన్నారు. అనంతగిరిపల్లి నుంచి మోత్కుపల్లి వరకు రూ.30కోట్లతో జరుగుతున్న రోడ్డు పనులను సోమవారం ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివరాజ్‌గౌడ్, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు బస్వలింగం, మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

బస్సులు సమయానికి నడపాలి

- రోడ్డుపై బైఠాయించి విద్యార్థుల ఆందోళన



చిట్టంపల్లి గేటు వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పూడూరు, జూలై 14, (ఆంధ్రజ్యోతి) : సమయానికి బస్సులు నడపటం లేదంటూ విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. సోమవారం పూడూరు మండల పరిధిలోని చిట్టంపల్లి గేటు వద్ద విద్యార్థులు బస్సులు నడపటం లేదంటూ ఆందోళనకు దిగారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వికారాబాద్ డిపోకు చెందిన బస్సులు అరకొరగా నడుపుతున్నారని, కళాశాలలు, పాఠశాలలకు తాము సమయానికి చేరుకోవడం లేదని వారు వాపోయారు. సమయానికి బస్సులు రాకపోయినా తమ ఇబ్బందులు ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి విద్యార్థులకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. విద్యార్థుల ఆందోళనతో కిలో మీటరు మేర వాహనాలు గంటలతరబడి నిలిచిపోయాయి.

సంక్షిప్తంగా..

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొడంగల్: గాంధీనగర్ కాలనీకి చెందిన మోహన్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యూత్ కాంగ్రెస్ జాతీయ కో ఆర్డినేటర్ కృష్ణంరాజు బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

వికారాబాద్: అనారోగ్యంతో మృతిచెందిన వికారాబాద్ పట్టణం ఇంద్రానగర్ కాలనీకి చెందిన మంగలి బాలు ఆదివారం రాత్రి మృతిచెందగా కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ ఆదేశాల మేరకు బాలు కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

17న లయన్స్‌క్లబ్ ఇన్‌స్టాలేషన్

కొడంగల్: ఈనెల 17న లయన్స్‌క్లబ్ ఆఫ్ కొడంగల్ 37వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌స్టాలేషన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17న సాయంత్రం 6 గంటలకు స్థానిక కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు మండలస్థాయి అధికారులతో స్పీకర్ సమీక్ష

ధారూరు: స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ నేడు(మంగళవారం) మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి నర్సింహులు తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో ఈ సమీక్ష ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బొంరాస్‌పేట్: ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో హరిలాల్ తెలిపారు. ఐఆర్‌పీ వేణుగోపాల్ చిన్నారులకు సోమవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ప్రతీ వారం రెండు రోజులు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు నవనీత, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక

దోమ: మల్లెపల్లి, బట్లచందారం గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. మల్లెపల్లి గ్రామ అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా రామనర్సయ్య, బట్లచందారం గ్రామ అధ్యక్షుడిగా వెంకట్రాములు, ఉపాధ్యక్షుడిగా పాండు నాయక్‌ను ఎన్నుకున్నారు.

గ్రామస్తులకు మార్చురీ ఫ్రీజర్ బాక్స్ అందజేత

మేడ్చల్ టౌన్: ఎల్లంపేట మున్సిపాలిటీ డబీల్‌పూర్ గ్రామ ప్రజల కోసం స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి ట్రస్ట్ తరఫున మార్చురీ ఫ్రీజర్ బాక్సును సోమవారం మాజీసర్పంచ్ రాజమల్లారెడ్డి అందజేశారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు మార్చురీ ఫ్రీజర్ బాక్సును అందజేసిన మల్లారెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

శామీర్‌పేట: విద్యార్థులు కళాశాలలో చదువుతో పాటు సంఘసేవనూ అలవర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అనిత హితవు పలికారు. శామీర్‌పేటలోని జగద్గిరిగుట్ట డిగ్రీ మహిళా కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఇషత్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిత అవగాహన సదస్సు నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

దుద్యాల: సాగారం తండాకు చెందిన రాథోడ్ నరేశ్‌కు సోమవారం ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.50వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవినాయక్, నాయకులు గోపాల్‌నాయక్, లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.35వేలతో ఆలయ అభివృద్ధి పనులు

మోమిన్‌పేట్: మండలంలోని రాళ్లగూడుపల్లిలో దుర్గామాత ఆలయ ఆవరణలో తాజా, మాజీ సర్పంచ్ సావిత్రమ్మ రాములుగౌడ్ తమ సొంత నిధులు రూ.35వేలతో షెడ్ నిర్మాణానికి సోమవారం పనులు ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు బాలకృష్ణగౌడ్ పాల్గొన్నారు.